క్లుప్తంగా

గిరిజనులకు కేంద్రం చేసింది శూన్యం

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు చేసింది శూన్యమని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకలవ్య పాఠశాలల్లో తాత్కాలికంగా భర్తీ చేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకుల పోస్టుల్లో రిజర్వేషన్లు పాటించాలని, గిరిజనులను అడవికి దూరం చేసేందుకు అటవీ సంరక్షణ చట్టం పేరుతో కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. జీఓ నంబరు 3 పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో గిరిజన ఓట్లు కోసమే బిర్సాముండ జయంతి పేరుతో మభ్యపెట్టే కార్యక్రమాలు చేస్తోందని రంజిత్‌కుమార్ పేర్కొన్నారు.

5లక్షల 97 వేల రొయ్యలు పంపిణీ


రొయ్యలు పంపిణీ చేస్తున్న మత్స్యశాఖ సిబ్బంది

సీతంపేట: ట్రైబుల్ ఫిషర్‌మెన్‌కు చెందిన 5 ట్యాంకులలో మొత్తం 5లక్షల 97 వేల 800ల మంచినీటి స్కంపీ జాతి రొయ్యలు పంపిణీ చేసినట్టు జిల్లా మత్స్య శాఖాధికారి తిరుపతయ్య తెలిపారు. మండలంలోని లోకొత్తవలస, బొండిగెడ్డ చెరువుల్లో రొయ్య పిల్లలు బుధవారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొండ నియోజకవర్గం పరిధిలో 4 మండలాల్లో చేపలు పెంపకం చేపట్టే రైతులకు చెందిన చెరువుల్లో ఇప్పటి వరకు 12 లక్షల 98 వేల 500ల చేప పిల్లలు సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో పాలకొండ డివిజన్ ఎఫ్‌డీఓ డబ్బీరు గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాలకు చెక్

పాలకొండ: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పలు విన్యాసాల ద్వారా విద్యార్థులకు సురక్షిత ప్రాంతాలకు బాధితులను తరలించడంపై అవగాహన కలిగించారు.

త్యాగధనులకు ఘన నివాళులు

సీతంపేట: జన జాతీయ గౌరవ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్వాతంత్ర్యోద్యమంలో వీరోచిత పోరాటం చేసిన త్యాగధనుల చిత్రపటాలకు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన వీరుల త్యాగాలను ఎన్నడూ మరువరాదన్నారు. వారి స్ఫూర్తితో భారతీయులంతా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనదారులకు పూర్తి స్థాయిలో పనులు

గరుగుబిల్లి: వేతనదారులకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడమే లక్ష్యమని ఏపీఓ ఎం.గౌరీనాథ్ అన్నారు. మండలంలోని శివ్వాంలో ఉపాధి హామీ పథకం పనులు గుర్తింపుపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులను గుర్తించడం జరుగుతుందన్నారు. రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించి తీర్మానం చేయనున్నట్టు తెలిపారు. ప్రతీ కుటుంబానికి 100రోజులు పనులు కల్పించేలా ప్రణాళికలు చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సర్పంచ్ రాయల పోలమ్మ, ఈసీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి

సీతంపేట: బ్రిటీష్ వారిపై మొట్టమొదటిగా తిరగబడిన ఆదివాసీ ఉద్యమకారుడు భగవాన్ బిర్సా ముండా 149వ జయంతి ఉత్సవాలు మన్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పెద్దూరులో ఆయన చిత్రపటానికి పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సమాజానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ ఛైర్మన్ హెచ్.మోహన్‌రావు, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, ఎంపీటీసీలు చంద్రశేఖర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాలలో..

గుమ్మలక్ష్మీపురం: భగవాన్ బిర్సా ముండా జయంతిని సారథి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ట్రైబల్ రైట్స్ ఫోరం (టీఆర్‌ఎఫ్) సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, విద్యార్థులు బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


కురుపాం: రస్తాకుంటుబాయి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి పద్మావతి


కొమరాడ: రాజ్యలక్ష్మీపురం సచివాలయం వద్ద లబ్ధిదారులు డ్యాష్ బోర్డు ప్రదర్శిస్తున్న ప్రజాప్రతినిధులు


భామిని: ఘనసరలో సంక్షేమ పథకాల జాబితా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు


వీరఘట్టంలో సచివాలయం-4 పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆంధ్రాకు జగనే మళ్లీ సీఎం కావాలి

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలనకు, అభివృద్ధికి ఆంధ్రాకు మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే కావాలని పలువురు పేర్కొన్నారు. జగనన్న పాలనలో పేదల బతుకులు బాగు పడ్డాయని, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగయ్యాయని అన్నారు. సంక్షేమ ఫలాల వల్ల అన్ని వర్గాల ప్రజల జీవితాలు మెరుగయ్యాయని, మళ్లీ జగనే ముఖ్యమంత్రి అయితే ప్రజల జీవితాలు మరింత మెరుగవుతాయని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం పలుచోట్ల నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


జియ్యమ్మవలస: పెద్దబుద్దిడి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


పాలకొండ: పట్టణంలో 3, 5 వార్డుల పరిధిలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న పట్టణ పార్టీ అధ్యక్షుడు మన్మథరావు


గుమ్మలక్ష్మీపురం: మండలంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ ప్రజాప్రతినిధులు


గరుగుబిల్లి: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎంపీపీ ఉరిటి రామారావు వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

సారా ధ్వంసం


వేలం వేసిన వాహనాలతో డీఎస్పీ కృష్ణారావు, ఎస్‌ఐ కళాధర్

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన సారాను పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేసారు. ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన సారా 1040 లీటర్లు, 122 బాటిల్స్‌ను ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ కళాధర్ తెలిపారు. 5 మోటార్ వాహనాలను వేలం వేసినట్టు తెలిపారు.

గ్రామ సచివాలయాలు ఆధునిక దేవాలయాలు

- సచివాలయ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కళావతి


గ్రామ సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గ్రామ సచివాలయాలు ఆధునిక దేవాలయాలని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని పెద్దూరులో గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బీకే, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పథకాలు నేరుగా లబ్ధిదారుల చెంతకే చేరుతున్నాయన్నారు. గ్రామాల్లో అర్హతే కొలమానంగా పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. ఏ పథకాలైన పక్కాగా అందరికీ అందేలా చూస్తామన్నారు. ఇప్పటి వరకు 800లకు పైగా గ్రామాలను తిరిగి సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. 90 శాతం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పైసా ఖర్చు లేకుండా వైద్యసేవలు అందుతున్నాయన్నారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ ఛైర్మన్ హెచ్.మోహన్‌రావు, ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్‌డీ సత్యం, గ్రామ కార్యదర్శులు సుదర్శనరావు, శివ, పీఆర్‌జేఈ కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు హెచ్.ఆదిలక్ష్మి, ఎ.కళావతి, వెంకునాయుడు, తిరుపతిరావు, ఎంపీటీసీలు చంద్రశేఖర్, హరిబాబు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు

కురుపాం: పక్కా ప్రణాళికతో చదివితే పదిలో మంచి ఫలితాలు సాధించవచ్చని ఐటీడీఏ ఏఎంఓ బి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నీలకంఠాపురం బాలికల, బాలుర సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక ప్రణాళికతో పదో తరగతి పరీక్షలు సిద్ధం కావాలన్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. హెచ్‌ఎం ఎ.గోవిందరావు, గిరిజారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలి

- మండల సమావేశంలో ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. వివిధ శాఖల అధికారులు గత మూడు నెలల్లో జరిగిన ప్రగతి నివేదికలను ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. ఈ సందర్భంగా భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మిస్తున్న భవన నిర్మాణ సముదాయాలు సకాలంలో పూర్తయ్యేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని, రోగుల తాకిడి, మెరుగైన వైద్య సేవల కోసం రిఫరల్ చేయాల్సిన పరిస్థితుల్లో 108 సేవలు మరింత పెంచాల్సిన అవసరం ఉందని వైద్యాధికారి రమ్య తెలియజేశారు. అటవీ ఫలసాయాల కొనుగోలుకు జీసీసీ ఎల్లవేళలా సిద్ధంగా ఉందని, గిరిజనులు సేకరించిన, పండించిన ఫల సాయాలను నేరుగా జీసీసీ కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకెళ్లి విక్రయించి మద్దతు ధరను పొందేలా గిరిజనులను ప్రోత్సాహించాలని జీసీసీ డీఆర్‌ఎస్ గోదాం ఇన్‌చార్జి ఎం.సాంబశివరావు ప్రజాప్రతినిధులను కోరారు. వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ చోడి పంట కొనుగోలు ప్రారంభించామని, త్వరలా అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోరి సంక్షేమ పథకాలను అమలుపరుస్తోందని, ఆయా పథకాలు అర్హులకు చేర్చడంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, ఈఓపీఆర్‌డీ జి.జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం


గోపాలపురంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ బొమ్మాళి భానుతో కలసి బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను ప్రజాప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లుగా సచివాలయ పరిధిలో ప్రతీ కుటుంబానికి అర్హతకు అనుగుణంగా అందించిన సంక్షేమ లబ్ధిని క్షుణ్ణంగా వివరించారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు నిండు మనసుతో మళ్లీ ఆశీర్వదించాలన్నారు. అర్హులు ఎక్కడ ఉన్నా నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను వారి గడప వద్దకే అందిస్తున్నారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేయలేని, నిలబెట్టుకోలేని వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిన తీరును వివరించారు. అర్హులు ఎవరికైనా సంక్షేమ లబ్ధి అందకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ క్రమంలో ప్రజలు విన్నవించిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, సర్పంచులు లోలుగు విశ్వేశ్వరరావు, గవర రాజశేఖర్, రణస్థలం రాంబాబు, బూరాడ తేజా, జి.దుర్గారావు, చింత సంఘం నాయుడు, ఎంపీడీఓ డొంక త్రినాథులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర మందిర నిర్మాణానికి భూమి పూజ


వేంకటేశ్వర మందిర నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని బురుజోలలో టీటీడీ మంజూరు చేసిన రూ.10లక్షలతో నిర్మించనున్న వేంకటేశ్వర మందిర నిర్మాణానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం భూమి పూజ చేశారు. ప్రజాభీష్టం మేరకు సమీపంలోని మెట్టపై మందిర నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం బురుజోల ఎంపీపీ స్కూల్‌కు మూడో విడత నాడు – నేడు కింద మంజూరైన భవన నిర్మాణ పనులను ఆరంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మడపాన కేశవ, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన


గరుగుబిల్లి: శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న పాఠకులు


భామిని: విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న ప్రిన్సిపాళ్లు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శనను బుధవారం నిర్వహించారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం పెరుగుతుందని నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు తెలిపారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి సూచనల మేరకు వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

భామిని: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన బుధవారం నిర్వహించారు. పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సముపార్జించాలని గురుకులు, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు కె.విజయనిర్మల, బి.శారద సూచించారు. విద్యార్థులతో కలిసి పుస్తక ప్రదర్శన తిలకించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా పుస్తకాలను పఠనం చేయటం వలన బహుళ ప్రయోజనాలు పొందవచ్చని, దీనిని విద్యార్థులు అలవర్చుకోవాలని పాలకొండ పెద్దకాపు వీధి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.సోమేశ్వరరావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలో విద్యార్థులతో కలసి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం

గుమ్మలక్ష్మీపురం: పుస్తక పఠనంతో జ్ఞానం కలుగుతుందని స్థానిక శాఖా గ్రంథాలయం నిర్వహకురాలు డి.లావణ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రంథాలయం సమీపంలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులచే పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు.


పాలకొండ రూరల్: పుస్తక ప్రదర్శలో పాల్గొన్న విద్యార్థులు


గుమ్మలక్ష్మీపురం: శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం

షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలి : డీఐఓ


రికార్డులను పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

గరుగుబిల్లి: షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు, గర్భిణులకు టీకాలను వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐఓ) టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని ఖడ్గవలస, నాగూరు కేంద్రాల్లో నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన ఆధునిక విధానాలను ఏ మేరకు అమలు చేస్తున్నారో పరిశీలించారు. చిన్నారులు, గర్భిణుల టీకాల నమోదు వివరాల రికార్డులను పరిశీలించారు. వ్యాక్సిన్ స్థితి, అత్యవసర మందులు, హబ్‌కట్టర్ పనితీరు తదితరమైనవి పరిశీలించారు. యూవిన్ పోర్టల్‌లో టీకాల నమోదు కార్యక్రమంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరినీ యూవిన్‌లో రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. అర్హులైన చిన్నారులకు సకాలంలో టీకాలు వేయకపోతే వారిని గుర్తించి తక్షణమే టీకాలు వేయాలన్నారు. ఆయనతో పాటు యూఎన్‌డీపీ ప్రాజెక్టు అధికారి బి.కమలాకర్, సిబ్బంది జయగౌడ్, యశోద తదితరులున్నారు.

18న మండల సమావేశం

కురుపాం: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 18న నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వీవీ శివరామప్ప బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

బాధితులకు అండగా స్వామి సేవా సమితి

గరుగుబిల్లి: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి తామున్నామంటూ స్వామి సేవా సమితి ముందుకు వచ్చింది. మండలంలోని కొంకడివరం గ్రామంలో ఇటీవల అల్లు పోలినాయుడు పూరిల్లు ప్రమాదవశాత్తు కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. విషయం తెలుసుకున్న పార్వతీపురం స్వామి సేవా సమితి కార్యదర్శి కుంచుమోజు రామ్మోహనరావు కుటుంబానికి కావల్సిన నిత్యావసర సరుకులను అందించడంతోపాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్లు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.